అరుణాచలానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు

షాద్‌నగర్‌టౌన్, జూలై 14 : షాద్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్ నుంచి అరుణాచలానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక ఆర్టీసీ డీఎం ఉష ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పౌర్ణమి రోజున తమిళనాడులోని అరుణాచల గిరి ప్రదక్షిణ చేసే భక్తుల కోసం ఈ బస్సు సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఈ నెల 21న పౌర్ణమిని పురస్కరించుకుని సూపర్ లగ్జరీ బస్సు ఈ నెల 19న రాత్రి 7 గంటలకు షాద్‌నగర్ బస్‌స్టేషన్ నుంచి కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలం చేరుకుంటుందని వివరించారు. గిరి ప్రదక్షిణ పూర్తయిన తరువాత సాయంత్రం 4 గంటలకు అరుణాచలం నుంచి షాద్‌నగర్‌కు బస్సులు తిరిగి రావడం జరుగుతుందన్నారు. ఇందుకుగాను పెద్దలకు రూ.3600, పిల్లలకు రూ.2400 టికెట్ చార్జ్ చేస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని, www.tsrtconline.in ఆన్‌లైన్ ద్వారా, మీ సమీపంలోని బస్సు రిజర్వేషన్ కేంద్రంలో రిజర్వేషన్ చేయించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9490021433, 9182645281, 9959226287లను సంప్రదించాలని ఆయన సూచించారు.



పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మాణం త్వరితగతిన చేపట్టాలని ఆదివారం రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పరిగి, తాండూరు, చేవెళ్ల, షాద్‌నగర్ ఎమ్మెల్యేలు రాంమోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, యాదయ్య, శంకర్ – పరిగి, జూలై 14

ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు TGSPDCL యాప్

విద్యుత్ ఏఈ పూర్ణచందర్ రావు

వికారాబాద్, జూలై 14 : ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లులను చెల్లించే వినియోగదారులు ఇకపై TGSPDCL యాప్, TGSPDCL వెబ్‌సైట్‌లో చెల్లించాలని వికారాబాద్ పట్టణ విద్యుత్ ఏఈ పూర్ణచందర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 1, 2024 నుంచి ఆర్‌బీఐ నిబంధనలననుసరించి ఫోన్ పే, జీ పే, పేటీఎం, అమెజాన్ పే లాంటి యాప్‌లలో విద్యుత్ బిల్లుల చెల్లింపులను నిలిపివేయడం జరిగిందన్నారు. వినియోగదారులు TGSPDCL యాప్‌ను ప్లే స్టోర్ నుంచి డౌన్లోడ్ చేసుకొని అందులో యూఎస్‌సీ, మొబైల్ నంబర్లను ఎంటర్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. తరువాత పే బిల్ అనే అప్షన్‌పై క్లిక్ చేసి పేమెంట్‌ను కంప్లీట్ చేయాలని వివరించారు. వెబ్‌సైట్ tgsouthernpower. org/paybillonline అనే లింక్ ద్వారా కూడా చెల్లింపు చేయవచ్చన్నారు. విద్యుత్ బిల్లుల చెల్లింపు విషయంలో ఎటువంటి సందేహాలున్నా 9440814041, 94408130831లకు ఫోన్ చేయాలన్నారు.

అనంతపద్మనాభస్వామిని దర్శించుకున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, జూలై 14 : వికారాబాద్ అనంతగిరి అనంత పద్మనాభస్వామి ఆలయాన్ని ఆదివారం వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ కుటుంబసమేతంగా సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలిచ్చి.. ఆలయ చరిత్రను వివరించారు. దర్శనానంతరం కలెక్టర్‌కు స్వామివారి శేష వస్త్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పద్మనాభం, ఈవో నరేందర్, సిబ్బంది శాంతకుమార్ ఉన్నారు.

ఇంగ్లిష్ చానెల్‌ను ఈదిన తొలి తెలుగు మహిళ

క్వీనీ విక్టోరియాకు ఘన సన్మానం

ఆమనగల్లు ఎంబీ చర్చిలో గంధం క్వీనీ విక్టోరియాను సన్మానిస్తున్న చర్చి నిర్వాహకులు

ఆమనగల్లు, జూలై 14 : ప్రపంచమంతా స్విమ్ ఎవరెస్టుగా పిలుచుకునే ఇంగ్లిష్ చానెల్‌ను 44 ఏండ్ల వయస్సులో ఈదిన తొలి తెలుగు మహిళగా ఇటీవలే రికార్డు నెలకొల్పిన ఆమనగల్లు పట్టణానికి చెందిన గంధం క్వీనీ విక్టోరియాను ఆదివారం స్థానిక ఎంబీ చర్చి, జ్ఞాన వాహిని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విక్టోరియా మాట్లాడుతూ.. ఇంగ్లండ్‌లోని డోవర్‌కోస్టు నుంచి రిలే స్విమ్మింగ్ ప్రారంభించి ఫ్రాన్స్ దేశంలోని ఫ్రెంచ్ కోస్టు వరకు 71 కిలోమీటర్ల క్రాస్ సిమ్మింగ్ చేసి 16 గంటల 50 నిమిషాల్లో ఇంగ్లిష్ చానెల్‌ను ఈదడం సంతోషంగా ఉందన్నారు. ఇప్పటి వరకు ఈ చానెల్‌ను ఈదిన తొలి తెలుగు మహిళ తానేనని చెప్పారు. 7 చానెల్స్‌ను ఈదాలనేది తన జీవిత లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వం ప్రోత్సహిస్తే భవిష్యత్తులో దేశానికి మరెన్నో పతకాలు తీసుకొస్తానని పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో తాను సాధించిన రికార్డులను తెలుగు రాష్ట్రాల సీఎంలకు అంకితమిస్తున్నట్లు విక్టోరియా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంబీ చర్చి నిర్వాహకులు ఎస్తేరు, బాబ్జీ, అన్నపూర్ణ, ప్రభు శంకర్, రవి, మంజుల, నరేందర్, జ్ఞాన వాహిని ఫౌండేషన్ సభ్యులు రవీంద్రనాథ్, లక్ష్మీనారాయణ, సత్యం, రంగారావు, వాసు, ప్రసాద్, నర్సింహ ఉన్నారు.

కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి
- పలు కాలనీల్లో పర్యటన

బడంగ్‌పేట, జూలై14 : కాలనీల్లో ప్రజల అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ కాలనీల్లో ఆదివారం ఎమ్మెల్యే పర్యటించారు. అల్మాస్‌గూడ తిరుమల్‌నగర్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి తల్లి రామిడి కళావతి పేరుతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే స్థానిక కార్పొరేటర్ రామిడి కవితా రాంరెడ్డితో కలిసి ప్రారంభించారు. నాదర్‌గుల్‌లోని చాణక్యపురి కాలనీ అసోసియేషన్ వారు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఆ పార్కును సందర్శించగా పార్కులో సౌకర్యాలు కల్పించాలని వేణుగోపాల్‌రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా జిల్లెలగూడలో సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్ ఏనుగుల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. అనంతరం దివ్యాంగులకు ట్రై సైకిల్స్ అందజేశారు. వివిధ కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే కాలనీల్లో పర్యటించారు. కమ్యూనిటీ హాల్ నిర్మించాలని మంత్రికి మొరపెట్టుకున్నారు. సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే ప్రజలకు హామీ ఇచ్చారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలను త్వరగా పరిష్కరించడానికి అధికారులతో మాట్లాడుతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కందుకూరు : క్యాంపు కార్యాలయంలో దివ్యాంగులకు ట్రై సైకిళ్లను అందజేస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

నిరుద్యోగులపై నిందలు సరికాదు

కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. ఆదివారం అల్మాస్‌గూడ తిరుమల్‌నగర్ కాలనీలో పర్యటించి ఆమె మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించకుండా తప్పించుకోవడానికి కోచింగ్ సెంటర్లు, నిరుద్యోగులపై నిందలు వేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం 11వేల పోస్టులు వేసిందన్నారు. అప్పుడు మెగా డీఎస్సీ ద్వారా 25 వేల పోస్టులు వేస్తామని ఎందుకు హామీ ఇచ్చారని ఆమె ప్రశ్నించారు. టెట్ పరీక్ష రాసిన తర్వాత 45 రోజుల సమయం ఇవ్వాలని కోరుతుండగా.. ఎందుకు ఇవ్వడం లేదన్నారు. పరీక్షలు రాయనివారే ధర్నా లు చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అనడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల ముందు నిరుద్యోగులకు ఇచ్చిన మెగా డీఎస్సీ ఏమైందన్నారు. 2014కు ముందు తెలంగాణ రాష్ట్రం ఏ విధంగా ఉందో.. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత అభివృద్ధి ఎలా ఉందో ప్రజలు ఇప్పుడు గమనిస్తున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రణాళికాబద్ధంగా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తుంటే నిరుద్యోగులను రెచ్చగొట్టి అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులపై నిర్బంధకాండ ప్రయోగిస్తున్నారన్నారు. సీపీఐ నాయకులను సైతం అరెస్టు చేస్తున్నారంటే సీఎం రేవంత్‌రెడ్డి ఇక ఎవరిని వదిలిపెడుతారన్నారు. గత ప్రభుత్వం మున్సిపాలిటీల్లో అభివృద్ధి చేయడానికి ప్రత్యేక నిధులు కేటాయిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.250 కోట్లు నిధులు రద్దు చేశారని ఆమె పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కందుకూరు : దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే మండలంలోని కటికపల్లి గ్రామానికి చెందిన సుధాకర్, మన్నెగూడ గ్రామానికి చెందిన పలువురికి ట్రై సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ హామీలను నెరవేర్చడంతోపాటు పింఛన్లను పెంచాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని సమస్యలను ప్రజలు తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేవేందర్, మాజీ ఎంపీటీసీ రాజు, బీఆర్ఎస్ యువ నాయకులు ఉదయ్ ముదిరాజ్, కార్యకర్తలున్నారు.

పడిందంటే.. ప్రమాదం తప్పదు

- ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె
- పట్టించుకోని విద్యుత్ అధికారులు

మొయినాబాద్, జూలై 14 : విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో అన్నదాతల వ్యవసాయ బోరు బావులకున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె ధ్వంసమైంది. ఆ దిమ్మె కూడా ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితిలో ఉన్నది. అది పడిందంటే పెను ప్రమాదం జరిగే అవకాశం ఉన్నదని రోడ్డు గుండా వెళ్లే వాహనదారులు, రైతులు ఆందోళన చెందుతున్నారు. మొయినాబాద్ మండల పరిధిలోని సురంగల్ గ్రామం దాటిన తరువాత శ్రీరాం నగర్ గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కనే రైతుల వ్యవసాయ బావి బోర్లకు కనెక్షన్ ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉన్నది. ఆ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె కూలి ఏండ్లు గడుస్తున్నా విద్యుత్ అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదు. రోడ్డు పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో రోడ్డుపై వెళ్లే వాహనదారులు, రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మ కూలితే మాత్రం రోడ్డు పక్కన వెళ్లే వాహనదారులకు ప్రమాదం వాటిల్లడంతో పాటు రైతుల బోరు బావులకు విద్యుత్ సరఫరా ఆగిపోయి పంటలు ఎండే అవకాశం ఉండకపోదని రైతులు అంటున్నారు. విద్యుత్ అధికారుల కంట పడకుండా ఎక్కడో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కాదు... ప్రతి నిత్యం వందలాది వాహనాలు వెళ్లే ప్రధాన రోడ్డు పక్కనే ఉన్నది. విద్యుత్ అధికారులకు ప్రైవేట్ వ్యక్తులు వ్యవసాయ క్షేత్రాల కోసం తీసుకునే విద్యుత్ కనెక్షన్‌లపై, వారికి ఏర్పాటు చేసే ట్రాన్స్‌ఫార్మర్‌పై ఉన్న శ్రద్ధ రైతుల కోసం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ నిర్వహణపై లేదని రైతులు మండిపడుతున్నారు. ముందే వర్షాకాలం.. ఏ సమయంలోనైనా దిమ్మ కూలవచ్చని రైతులు అంటున్నారు. దిమ్మ కూలి ప్రమాదం జరగక ముందే కొత్త దిమ్మను నిర్మించి అమర్చాలని రైతులు అధికారులను కోరుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మ కూలిందని విద్యుత్ ఏఈని వివరణ కోరడానికి పలుమార్లు ఫోన్ చేసినా స్పందించడంలేదు.

ఎప్పుడు కూలుతుందో తెలియని స్థితిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె

అంతర్జాతీయ సదస్సులో ఓయూ ప్రొఫెసర్

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 14 : అమెరికా, థాయిలాండ్‌లలో జరిగిన అంతర్జాతీయ సదస్సుల్లో ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీరాములు పాల్గొని పరిశోధనా పత్రం సమర్పించారు.

అమెరికాలోని మిల్లింకిన్ యూనివర్సిటీలో జరిగిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్‌లో ప్రొఫెసర్ శ్రీరాములు పాల్గొని 'డైనమిక్స్ ఆఫ్ కన్సూమర్ ప్రిఫరెన్సెస్ ఫర్ బ్రాండెడ్ లగ్జరీ కార్స్ ఇన్ హైదరాబాద్ యాన్ ఇండియన్ కేస్ స్టడీ'అనే అంశంపై పరిశోధనా పత్రం రూపొందించి సమర్పించారు. అనంతరం బ్యాంకాక్‌లోని ది గ్రాండ్ ఫోర్ వింగ్స్ కన్వెన్షన్ హోటల్‌లో నిర్వహించిన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించారు.

ఎల్లమ్మకు మూడో బోనం

మెహిదీపట్నం, జూలై 14 : గోల్కొండలో కొలువైన జగదాంబిక మహంకాళి ఎల్లమ్మ అమ్మవారికి భక్తులు ఆదివారం మూడో బోనం సమర్పించారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు నగరం నలుమూలల నుంచి భక్తులు తరలిరావడంతో గోల్కొండ కోట కిటకిటలాడింది. మెహిదీపట్నం, ఆసిఫ్‌నగర్, చింతల్‌బస్తీ, పురానాపూల్, నానల్‌నగర్, లంగర్‌హౌస్, రాజేంద్రనగర్, గండిపేట తదితర ప్రాంతాల నుంచి భక్తులు తొట్టెలను ఊరేగింపుగా తెచ్చి.. అమ్మవారికి సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఆటంకాలు కలుగకుండా దక్షిణ, పశ్చిమ మండలం డీసీపీ చంద్రమోహన్ ఆధ్వర్యంలో ఈవో శ్రీనివాస్ రాజు, బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ కాంత అరవింద్ మహేశ్‌కుమార్, బోనాల కులవృత్తుల సంఘం అధ్యక్షుడు సాయిబాబాచారి ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. అమ్మవారికి చేసిన పుష్పాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



ప్రజాభవన్‌లో బోనాల ఉత్సవాల్లో ఘటం తీసుకువస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

గోల్కొండలో జగదాంబిక మహంకాళి ఎల్లమ్మ జాతరకు తరలివచ్చిన భక్తులను చెదరగొడుతున్న పోలీసులు

మహాగణపతి..డెబ్బై అడుగులు

ఖైరతాబాద్, జూలై 14 : ఖైరతాబాద్ మహాగణపతి 70 ఏండ్ల చరిత్రలో డెబ్బై అడుగుల ఎత్తైన మట్టి విగ్రహం రూపుదిద్దుకుంటున్నది. ఈ ఏడాది సప్తముఖాలతో నిలబడి ఉండే ఆకారంలో స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నారు. గతేడాది 63 అడుగుల ఎత్తులో మట్టి విగ్రహాన్ని ప్రతిష్ఠించగా, ఈ ఏడాది చరిత్రలోనే తొలిసారిగా 70 అడుగుల ఎత్తు, 28 అడుగుల వెడల్పులో విగ్రహాన్ని తయారు చేస్తున్నారు. శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్ నేతృత్వంలో 25 మంది వెల్డర్లు, 150 మందికి పైగా ఇతర కార్మికులు షిఫ్టులవారీగా విగ్రహ నిర్మాణంలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే తల, కాళ్లు, నడుం భాగానికి సంబంధించిన వెల్డింగ్ పనులు పూర్తయ్యాయని ఉత్సవ కమిటీ తెలిపింది. ఇందుకుగాను ఆదిలాబాద్, జిన్నారానికి చెందిన నర్సయ్య ఆధ్వర్యంలో 25 మంది కార్మికులు షెడ్డు నిర్మాణాన్ని చేపడుతున్నారు.

50 బండిళ్ల వరిగడ్డి, వరిపొట్టు

స్టీలు, ఇనుప రాడ్స్‌లో ముందుగా స్వామి వారి 70 అడుగుల విగ్రహాన్ని రూపకల్పన చేస్తారు. అనంతరం అందులో వరిగడ్డి, పొట్టుతో, జనుము, గన్నీ బ్యాగ్స్‌తో ఫినిషింగ్ చేస్తారు. ఇటిక్యాల గ్రామానికి చెందిన దత్తాత్రేయ రైస్ మిల్లు నుంచి వరిపొట్టును తెప్పించారు. ఇందులో 50 బండిళ్ల వరిగడ్డి, వరిపొట్టు, ఏలూరు నుంచి నల్లమట్టి, గుజరాత్ నుంచి తెప్పించిన బంకమట్టి, ఒక టిప్పర్ సన్నని ఇసుకను ఉపయోగిస్తున్నారు. చివర్లో ఒడిశాకు చెందిన జోగారావు, చెన్నైకి చెందిన మూర్తి, కాకినాడ, గొల్లపాలెంకు చెందిన భీమేశ్ ఆధ్వర్యంలో ఆరిస్టులు మోల్డింగ్ పనులను చేస్తారని ఉత్సవ కమిటీ చైర్మన్ సింగరి రాజ్ కుమార్ తెలిపారు.

మనువాద చట్టాలను వ్యతిరేకించాలి

రవీంద్రభారతి, జూలై 14 : న్యాయ విద్య చదువుతున్న విద్యార్థులకు మనుసంస్కృతి బోధించాలని కేంద్ర మానవనరుల శాఖ ఢిల్లీ యూనివర్సిటీకి వచ్చిన ప్రతిపాదనలను ఢిల్లీ యూనివర్సిటీ వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని దళిత బహుజన పార్టీ డీబీపీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీం కోర్టు న్యాయవాది కృష్ణ స్వరూప్ ప్రకటించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. మనువాద చట్టాలు రాజ్యాంగానికి వ్యతిరేకమని తెలిపారు. మనుసంస్కృతిని యూనివర్సిటీ న్యాయ విద్యలో బోధించమని ఆర్ఎస్ఎస్, బీజేపీ చేస్తున్న విధానాలను వ్యతిరేకించాలన్నారు.

వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో ఆదివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో పలువురు కళాకారుల నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. బెంగళూరుకు చెందిన ఫ్లూట్ ఎంఫీట్ అకాడమీ నిర్వాహకులు అరణ్య నరైన్ శిష్య బృందంతో కలిసి ప్రదర్శించిన భరతనాట్య నృత్యాలు ప్రత్యేకంగా అలరించాయి. ప్రదర్శనల్లో విష్ణు కౌతం, శ్రీవల్లి, మాథెయ్ మళ్లెద్వజ, చూడరేయ్, ప్రదోష కృతి, రంజని మల శివస్తుతి అంశాలను శ్రేయ, అనన్య, వర్ష, రీతూ, యశస్విని, శ్రావ్య, ప్రీతలు భరతనాట్య నృత్యరూపకంలో ప్రదర్శించిన తీరు ఆద్యంతం ఆకట్టుకున్నది. – కొండాపూర్, జూలై 14